
చెత్త వేసేవారిని గుర్తించడానికి ఏఐ నిఘా నేత్రం

చెన్నై: మహానగర చెన్నై కార్పొరేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారిని స్పష్టంగా గుర్తించి జరిమానా విధించడానికి ఏఐ సాంకేతికతో కూడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ కుమరగురుబరన్ తన 'ఎక్స్' పేజీలో వెల్లడించారు. కెమెరాల ద్వారా చెత్త వేసేవారిని, కాల్చేవారిని క్షుణ్ణంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఇప్పటివరకు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసేవారి నుంచి 'స్పాట్ ఫైన్' కింద రూ.17,96,800 వసూలు చేసినట్లు తెలిపారు. జరిమానా విధించేందుకు 468 పరికరాలను ఐఓబీ బ్యాంకు నుంచి కార్పొరేషన్ యంత్రాంగం పొందింది. పరికరాల ద్వారా కార్పొరేషన్ పన్నులు కూడా వసూలు చేయొచ్చు.

పుదువైలో గిరిజనులకు దీపావళి కానుక

● బ్యాంకు ఖాతాల్లో రూ.వెయ్యి డిపాజిట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా పుదుచ్చేరిలో 18ఏళ్ల పైబడిన ఆదిద్రావిడ, గిరిజనులకు ఉచిత పంచె, చీరల బదులు రూ.వెయ్యి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రంగసామి ప్రారంభించారు. 1.27 లక్షల మంది లబ్ధిదారులకు రూ.12.76 కోట్ల నిధులు వెచ్చించనున్నారు. ఆదిద్రావిడ సంక్షేమశాఖ మంత్రి సాయి శరవణన్‌కుమార్ మాట్లాడుతూ...గత కాంగ్రెస్ పాలనలో ఆదిద్రావిడ, గిరిజనులకు దీపావళి సందర్భంగా రూ.500 కూడా ఇచ్చిన దాఖలాలేవన్నారు. ఇప్పుడు 43 వేల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయని చెప్పారు. బడ్జెట్‌లో ప్రకటించినట్లు 2025 పొంగల్‌కు రూ.వెయ్యికి బదులు పంచె, చీర ఇస్తామన్నారు. సమయం లేనందున దీపావళికి నగదు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రంగసామి మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యం నవంబరు 14న లేదా 15 నుంచి పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం చౌక దుకాణాలు లేని ప్రాంతాల్లో దీపావళి బియ్యం, చక్కెర తదితర వాటిని పాఠశాలలు లేదా అంగన్‌వాడీల ద్వారా అందుకోవచ్చని వివరించారు.



నగదు జమ ప్రారంభిస్తున్న సీఎం రంగసామి

డీఎంకే కూటమిలో విభేదాలు: ఈపీఎస్

సేలం, న్యూస్‌టుడే: డీఎంకే కూటమిలో విభేదాలు ఏర్పడ్డాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి ఆరోపించారు. సేలం జిల్లా ఎడప్పాడి ఉత్తర, దక్షిణ యూనియన్ అన్నాడీఎంకే తరఫున మేల్‌సిత్తూరు ప్రాంతంలో జరిగిన సమావేశంలో ఈపీఎస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓట్లు గతం కన్నా ఒక శాతం పెరిగాయని చెప్పారు. అదే సమయంలో 2019, 2024 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే డీఎంకే ఓట్ల శాతం తగ్గిందని తెలిపారు. కూటమి బలం లేకుండానే అన్నాడీఎంకే ఎక్కువ ఓట్లు సాధించిందని పేర్కొన్నారు. చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూపి డీఎంకే ఎన్నికలు ఎదుర్కోవటం లేదని, కూటమి పార్టీలను నమ్ముకునే బరిలో నిలుస్తోందని ఎద్దేవా చేశారు. ఆ కూటమిలోని పార్టీలు 41 నెలలుగా ప్రభుత్వాన్ని విమర్శించలేదని, ఇప్పుడు మొదలుపెట్టారని తెలిపారు. ఇది డీఎంకే కూటమిలో విబేధాలు ఉన్నాయనేందుకు సంకేతమన్నారు. దేశంలోనే తమిళనాడు ముందంజలో ఉందని స్టాలిన్ చెబుతున్నారని, ఇందుకు ఆయన ఏం చేశారో వివరించాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే హయాంలోని పథకాలకు స్టిక్కర్లు అతికించుకుంటున్నారని విమర్శించారు.



ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిసామి

● చేనేత కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని 28న గుడియాత్తం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయనున్నట్లు ఎడప్పాడి పళనిసామి ప్రకటనలో తెలిపారు.

పాఠశాల ప్రయోగశాలలో లీకైన గ్యాస్

స్పృహ కోల్పోయిన 35 మంది విద్యార్థినులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై తిరువొత్తియూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో వెయ్యిమందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాల మూడో అంతస్తులో రసాయన గ్యాస్ లీకైంది. పీల్చిన పలువురు విద్యార్థులు స్పృహకోల్పోయారు. ఉదయం 10.30 గంటల నుంచే లీకవగా అప్పుడే ఎందుకు చర్యలు చేపట్టలేదని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. కెమిస్ట్రీ ల్యాబ్ నుంచి గ్యాస్ లీకైనట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. స్పృహకోల్పోయిన 35 మంది విద్యార్థినులను అంబులెన్స్‌లో తిరువొత్తియూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ తక్కువ పడకలు ఉండటంలో ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స అందిస్తున్నారు. కొందరిని వారి తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితులను ఎమ్మెల్యే శంకర్ పరామర్శించారు. ఈ నేపథ్యంలో సంబంధిత పాఠశాలలో సైంటిఫిక్ నిపుణులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం పరిశీలిస్తోంది.



ఘటన చోటుచేసుకున్న ప్రయోగశాల



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కలవరపెడుతున్న రక్తహీనత

● తిరుచ్చిలో అత్యధికం

48.3 శాతం మంది విద్యార్థుల్లో గుర్తింపు

● అప్రమత్తమైన ఆరోగ్యశాఖ

పలురకాల అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న రక్తహీనత రాష్ట్రంలో అధికంగా ఉంది. ప్రధానంగా యుక్త వయసు పిల్లల్లో ప్రమాదకరంగా మారుతోంది. తీవ్రతను గుర్తించిన ఆరోగ్యశాఖ అన్ని జిల్లాలపైనా దృష్టిపెట్టి సర్వే నిర్వహించింది.

ఈనాడు-చెన్నై

ప్రత్యేకించి పాఠశాల, కాలేజీస్థాయి విద్యార్థుల్లో రక్తహీనత ఎంతమందిలో ఉందనే అంచనాలు, గణాంకాలు తమిళనాడు ప్రభుత్వం వద్ద లేవు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కింద జాతీయస్థాయి గణాంకాలు ఉన్నా.. రాష్ట్ర పరిధిలో కచ్చితమైనవి లేవు. ఇందులో భాగంగా 10 నుంచి 19 ఏళ్ల యుక్తవయసు పిల్లలపై 2023 మే నుంచి 2024 మార్చి వరకు సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు(పీహెచ్‌సీ) వచ్చిన 19,15,072 మంది పిల్లల రక్తనమూనాలు సేకరించారు.

తేలిన నిజం..


ఆరోగ్యశాఖ పరిశోధనలో.. రాష్ట్రంలోని 48.3శాతం యుక్తవయసు విద్యార్థుల్లో రక్తహీనత(అనీమియా) ఉన్నట్లు గుర్తించారు. ఆడపిల్లల్లో 54.4 శాతం, మగపిల్లల్లో 41శాతం మందిలో తీవ్రత కనిపించినట్లు వెల్లడించారు. మొత్తం విద్యార్థుల్లో 0.7శాతం మందిలో తీవ్రంగా ఉన్నట్లు, 40.2 శాతం మందిలో మధ్యస్థాయి, 59.1 శాతం మందిలో స్వల్పంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకించి ఆడపిల్లల్లో తీవ్రత ఉన్న నేపథ్యంలో మరో పరిశీలన చేయగా.. 2.1శాతం మందిలో తీవ్రత బాగా ఉన్నట్లుగా తెలిపారు. 47శాతం మందిలో మధ్యస్థాయిలో ఉంది.

పిల్లల్లో తీవ్ర ప్రభావం..

రక్తహీనత యుక్త వయసు పిల్లల్లో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నట్లు పలు పరిశోధనలు చెబుతున్నాయి. త్వరగా పెళ్లి చేసుకున్నవారిలో, గర్భం దాల్చినవారిలో అనీమియా ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడిస్తున్నారు. యుక్తవయసువారిలో ఐరన్ లోపం ఉండటమూ ఇందుకు కారణమంటున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ.. రక్తహీనత పిల్లల్లో సహజంగా వస్తుంటుందని అభిప్రాయపడ్డారు. పిల్లల వృద్ధిపై ఇది ప్రభావం చూపుతోందని, వారి వ్యవహార శైలిలోనూ మార్పులు కనిపిస్తున్నాయని వివరించారు. పిల్లలు త్వరగా అలసిపోవడం, చర్మం, గోళ్లు పెలుసుబారడంలాంటి లక్షణాలుంటున్నాయని అన్నారు. ప్రత్యేకించి ఆడపిల్లల్లో తీవ్రంగా రుతుస్రావం అవడం, వైద్య కారణాలు ఉంటున్నాయని వివరించారు.

ఇతర ప్రాంతాలతో పోల్చితే..

రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో పోల్చితే తిరుచ్చిలోని విద్యార్థుల్లో రక్తహీనత తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నట్లుగా ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక్కడ ఏకంగా 84శాతం మంది విద్యార్థుల్లో ఇది తేలింది. ఆ తర్వాత దిండుక్కల్, కళ్లకురిచ్చిలో 70శాతం మందిలో కనిపించింది. కడలూరు విద్యార్థుల్లో 61శాతం మందిలో ఉన్నట్లు గుర్తించారు.



ఎరుపురంగు ఉన్న ప్రాంతాల్లో 50శాతంపైగా విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతుండగా, పసుపు రంగు ప్రాంతాల్లో 30-50శాతం, ఆకుపచ్చ ప్రాంతాల్లో 30 శాతం కన్నా తక్కువ మంది ప్రభావానికి లోనైనట్లు అధికారులు చెబుతున్నారు.

పౌష్టికాహారం.. సంరక్షణ

అనీమియా బారి నుంచి పిల్లల్ని బయటపడేసేందుకు పాఠశాల స్థాయిలోనే మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆరోగ్యశాఖ భావిస్తోంది. పిల్లలకు చక్కటి పౌష్టికాహారం అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తోంది. తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల నుంచి మధ్యస్థాయి, స్వల్ప ప్రభావం ఉన్న జిల్లాల్లో ప్రాధాన్యతను అనుసరించి కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నట్లు వివరించారు. ఆడపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరమున్నట్లు సర్వే ద్వారా గుర్తించామని అధికారులు వివరించారు. తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో అత్యవసరంగా స్పందించాల్సిన అవసరముందని ప్రజారోగ్యశాఖ సంచాలకులు టి.ఎస్.సెల్వవినాయగం, ఇదే శాఖకు చెందిన పరిశోధకులు శినుప్రియ, షణ్ముగసుందరం తెలిపారు.

మూడు నగరాల్లో స్వచ్ఛమైన గాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: స్వచ్ఛమైన గాలి ఉన్న 10 నగరాల జాబితాలో రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు చోటుదక్కింది. దేశంలో పలు ప్రాంతాల్లో వాయి కాలుష్యం అధికమైంది. గాలి నాణ్యత తగ్గుతూ ఉంది. ఈ కారణంగా పలువురు గాలి నాణ్యతగా ఉండే ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-50 ఉంటే తక్కువ ప్రభావం, 51-100 స్వల్పంగా శ్వాస సమస్య, 101-200 ఉంటే ఊపిరితిత్తులు, ఆస్తమా, గుండె జబ్బులు ఉన్నవారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. 201-300 ఉంటే చాలామంది ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. 301-400 ఉంటే శ్వాసకోశవ్యాధి బారిన పడతారు. 401-500 ఉంటే ఆరోగ్యకరమైన ప్రజలు కూడా ప్రభావితమవుతారు. ఇది వరకే వ్యాధులు ఉన్నవారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో 241 నగరాల కాలుష్యస్థాయి జాబితాను కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు గురువారం విడుదల చేసింది. తిరుచ్చి జిల్లా పల్‌కలైపేరూర్ మొదటిస్థానం, రామనాథపురం 4, మదురై 7వ స్థానంలో నిలిచాయి.

ఉదయనిధి పదవి నుంచి వైదొలుగుతారా?: ఎల్.మురుగన్

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళ తల్లి గీతం వ్యవహారంలో ఉదయనిధి పదవి నుంచి వైదొలుగుతారా అని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ ప్రశ్నించారు. సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పాల్గొన్న ప్రభుత్వ కార్యక్రమంలో రెండుసార్లు తమిళ తల్లి గీతం తప్పుగా పాడారని, ఇందుకు ముఖ్యమంత్రి బదులేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రార్థనాగీతం తప్పుగా పాడితే బాధ్యత వహించరా అన్నారు.





నీటి కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు చెన్నై క్రిస్టియన్ కళాశాల మహోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోటీల్లో బొమ్మలు గీస్తున్న విద్యార్థులు ● బంకమట్టితో డాల్ఫిన్ తయారు చేస్తున్న విద్యార్థి

- న్యూస్‌టుడే, ఆర్కేనగర్

సీఎంపై చర్యలకు అనుమతించాలి

గవర్నర్‌కు వినతి

చెన్నై, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై క్రిమినల్ చర్యలు చేపట్టడానికి అనుమతించాలని గవర్నర్ ఆర్.ఎన్.రవిని భాజపా రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామన్ కోరారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో వినతిపత్రం అందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ... ఇటీవల గవర్నర్ పాల్గొన్న కార్యక్రమంలో తమిళతల్లి ప్రార్థనా గీతంలోని ఓ వాక్యాన్ని వదిలివేసి పాడటం వివాదాస్పదమైందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌పై జాత్యహంకార ఆరోపణలను ముఖ్యమంత్రి చేశారన్నారు. గవర్నర్‌ను పనిచేయకుండా అడ్డుకోవడం, జాత్యంహాకార అభిప్రాయాలను ప్రచారం చేసి ప్రజాప్రశాంతతకు భగ్నం కలిగించడానికి ప్రయత్నించడం తదితర సెక్షన్ల కింద ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై క్రిమినల్ చర్యలు చేపట్టడానికి అనుమతించాలని కోరినట్లు పేర్కొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న అశ్వత్థామన్

మైకు పనిచేయలేదని..

తమిళతల్లి గీతాన్ని మళ్లీ పాడించిన ఉదయనిధి

సైదాపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఫెలోషిప్ ప్రాజెక్టు కింద శిక్షణ పూర్తి చేసుకున్న 19 మందికి చెన్నై సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి స్టాలిన్ ధ్రువీకరణపత్రాలు అందించారు. కార్యక్రమ ప్రారంభంలో తమిళ తల్లి గీతం పాడారు. మైకు సరిగా పని చేయకపోవటంతో ద్రావిడ నల తిరునాడుమ్ అనే వాక్యంలో తిరునాడుమ్ వినిపించలేదు. వెంటనే ఉప ముఖ్యమంత్రి గ్రహించి మళ్లీ మొదటి నుంచి ప్రార్థనాగీతం పాడించారు. తెలిసింది. కార్యక్రమంలో ప్రత్యేక పథక ప్రణాళిక శాఖ కార్యదర్శి తారేస్ అహ్మద్ తదితర పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

నురుగు రాకుండా చర్యలు తీసుకోండి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: తెన్‌పెన్నై నదిలో విషపూరిత నురుగు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున తెన్‌పెన్నై నదిలో 4 వేల ఘటనపుటడుగుల నీరు విడుదల చేశారన్నారు. హోసూరు, నందిమంగళం రోడ్డులోని కాజ్‌వేలో రసాయన నురుగు చేరిందని, దుర్వాసనతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆ మార్గంలో వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. నురుగు పొలాల్లోకి ప్రవేశించటంతో నష్టం వాటిల్లుతోందన్నారు. కర్ణాటకలో నీటి వనరుల పక్కన పరిశ్రమలు ఉన్నందున వాటి వ్యర్థాలతోనే ఇలా జరుగుతోందని తెలిసిందన్నారు.

■ ఆయన విడుదల చేసిన మరో ప్రకటనలో.. ప్రజాసేవే రాజకీయం అనే లక్ష్యంతో జీవించిన మహానేత ముత్తురామలింగ దేవర్ జయంతిని పురస్కరించుకుని 30న రామనాథపురం జిల్లా పశుంపొన్‌లోని ఆయన విగ్రహానికి అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ తరఫున నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

30న దేవర్ గురుపూజ

13 కిలోల బంగారు కవచం అప్పగింత

ప్యారిస్, న్యూస్‌టుడే: దేవర్ గురుపూజ సందర్భంగా 13 కిలోల బంగారు కవచాన్ని అన్నాడీఎంకే కోశాధికారి దిండుక్కల్ శ్రీనివాసన్‌కు అప్పగించారు. రామనాథపురం జిల్లా పశుంపొన్‌లోని ముత్తురామలింగ దేవర్ స్మారకం వద్ద ఏటా అక్టోబరు 30న గురుపూజ నిర్వహిస్తారు. ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత పశుంపొన్ దేవర్‌కు రూ.3 కోట్ల విలువైన 13 కిలోల బంగారు కవచాన్ని అన్నాడీఎంకే తరఫున అందించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కవచాన్ని మదురైలోని బ్యాంకు లాకర్లో భద్రపరుస్తారు. 30న గురుపూజ సందర్భంగా మదురై బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర నుంచి బంగారు కవచాన్ని అన్నాడీఎంకే కోశాధికారి దిండుక్కల్ శ్రీనివాసన్‌కి అప్పగించారు. అనంతరం డీఎస్పీ నేతృత్వంలో పోలీసు భద్రత మధ్య పశుంపొన్‌కు తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు నత్తం విశ్వనాథన్, సెల్లూర్ రాజు, ఆర్బీ ఉదయకుమార్ పాల్గొన్నారు.



బంగారు కవచాన్ని అప్పగిస్తున్న దృశ్యం

ఆసుపత్రుల్లో ఔషధాలు సిద్ధం చేయండి

● దీపావళి నేపథ్యంలో ఆరోగ్యశాఖ ఆదేశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళి సమీపిస్తున్నందున బాణసంచా ప్రమాదాలకు చికిత్స అందించేలా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని ప్రజారోగ్యశాఖ ఆదేశించింది. పండుగ సమయంలో చేయాల్సినవి, చేయకూడనివాటిపై మార్గదర్శకాలు విడుదల చేసింది. పిల్లలు సురక్షితంగా బాణసంచా కాల్చేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండుగ సమయంలో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు సత్వరమే వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో టాపాసులు కాల్చాలన్నారు. పక్కనే మండే పదార్థాలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు ఇంట్లోనే ఉండాలనానరు. పేలని టపాసుల జోలికి వెళ్లకూడదన్నారు.

నిల్వ అవసరం..

అన్ని ఆసుపత్రుల్లో కాలిన గాయాలకు చికిత్స అందించేందుకు సరిపడా ఔషధాలు నిల్వ ఉంచుకోవాలన్నారు. తగినన్ని రక్త యూనిట్లు, సిద్ధం చేసుకోవాలన్నారు. భారీ ప్రమాదం జరిగితే వెంటనే ప్రజారోగ్యశాఖకు చెందిన 94443 40496, 87544 48477 సెల్ నెంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

డీఎంకే పరిశీలకుల సమాలోచన 28న

చెన్నై, న్యూస్‌టుడే: శాసనసభ నియోజకవర్గాల డీఎంకే పరిశీలకుల సమాలోచన పార్టీ అధ్యక్షుడైన ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన సోమవారం జరగనుంది. అన్నా అరివాలయంలో ఆ రోజు 11 గంటలకు జరగనున్న కార్యక్రమంలో రానున్న శాసనసభ ఎన్నికల పనుల గురించి చర్చించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.


విద్యార్థి విభాగ సమావేశం నవంబరు 9న

చెన్నై: డీఎంకే విద్యార్థి విభాగం రాష్ట్ర, జిల్లా, నగర ఆర్గనైజర్లు, డిప్యూటీ ఆర్గనైజర్ల సమావేశం నవంబరు 9న కరూర్‌లో జరగనుంది. విభాగం కార్యదర్శి ఎళిలరసన్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో కరూర్ జిల్లా కార్యదర్శియైన విద్యుత్తుశాఖ మంత్రి సెంథిల్‌బాలాజీ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొననున్నారు. యువజన విభాగ కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం, 'తమిళ మాణవర్ మండ్రం' ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదుపై చర్చించనున్నట్టు ప్రకటనలో ఎళిలరసన్ వెల్లడించారు.

టికెట్ ధరలు రూ.వేలల్లో ఉంటే పేదలు ఎలా దర్శనం చేసుకుంటారు?

మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆలయాల్లో టికెట్ ధరలు రూ.వేలల్లో ఉంటే పేదలు ఎలా దర్శనం చేసుకుంటారని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. తూత్తుక్కుడి జిల్లా తిరుచ్చెందూర్‌కి చెందిన రామ్‌కుమార్ ఆదిత్తన్ మదురై ధర్మాసనంలో దాఖలు చేసిన పిటిషన్‌లో ... తిరుచ్చెందూర్ సుబ్రమణిస్వామి ఆలయంలో ఏటా ఐప్పసి మాసంలో ఆరురోజులు స్కంధషష్ఠి వేడుకలు జరుపుతారని తెలిపారు. సాధారణ రోజుల్లో ఉచిత దర్శనం ఉందని, శీఘ్ర దర్శనం ఒకరికి రూ.100 వసూలు చేస్తారని, విశేషరోజుల్లో రుసుము రూ.200గా ఉంటుందన్నారు. గతేడాది స్కంధషష్ఠి సమయంలో శీఘ్ర దర్శనం రుసుము ఒకరికి రూ.1000గా నిర్ణయించారని, ఇందుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన సుమారు 200 మంది భక్తులు అరెస్టు అయ్యారని తెలిపారు. ఈ ఏడాది శీఘ్ర దర్శనానికి రుసుము రూ.1000గా నిర్ణయించినట్లు ఆలయ యాజమాన్యం తెలిపిందన్నారు. అంత వెచ్చించి పేద భక్తులు భగవంతుడిని దర్శనం చేసుకోవడం కష్టమవుతుందన్నారు. పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం.. ఆలయంలో దర్శనానికి రూ.1000, రూ.2000 వసూలు చేస్తే పేద భక్తులు ఏమవ్వాలని ప్రశ్నించింది. వసతి ఉన్న వారికి మాత్రమే ఆలయాలు ఉన్నాయా అని ప్రశ్నించింది. దేవాదాయశాఖ కమిషనర్, తూత్తుక్కుడి జిల్లా కలెక్టరు తదితరులు జవాబివ్వాలని ఉత్తర్వులు ఇచ్చి విచారణ వాయిదా వేసింది.



ప్రముఖుల కటౌట్లు



ప్రవేశద్వారం వద్ద ఇలా..



ప్రధాన వేదిక

టీవీకే మహానాడుకు భారీ ఏర్పాట్లు

రేపు విక్రవాండిలో నిర్వహణ ● సిద్ధమవుతున్న ప్రాంగణం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా విక్రవాండి తాలూకా వి.సాలైలో ప్రముఖ నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం(టీవీకే) రాజకీయ మొదటి మహానాడు 27న సాయంత్రం 5 నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రాంగణానికి సమీపంలోని చెన్నై- తిరుచ్చి జాతీయ రహదారిలో సుమారు 3 కి.మీ. మేర పార్టీ జెండాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

● జాతీయ రహదారి పక్కన 85 ఎకరాల్లో సభా ప్రాంగణం, సుమారు 207 ఎకరాలను వాహనాలు నిలపడానికి కేటాయించారు.

● పార్టీ జెండాలోని రెండు ఏనుగులు ఘీంకరించేలా, చెన్నై జార్జి కోట ఆకారంలో ప్రవేశద్వారాన్ని ముస్తాబు చేస్తున్నారు. దానిపై కేరళలో ప్రత్యేకంగా తయారు చేయించిన విజయ్ కటౌట్ పెట్టారు. బారికేడ్లు, కుర్చీలు సిద్ధం చేశారు.

● సభా ప్రాంగణంలో విజయ్ ప్రతి కార్యకర్తను కలిసేలా ప్రత్యేకంగా వేదిక నిర్మించారు. దీనికి 'వెట్రికొళ్గై తిరువిళా' పేరు పెట్టారు.

● మహానాడు ప్రాంగణంలో కామరాజర్, తందై పెరియార్, విజయ్, అంబేడ్కర్ కటౌట్లు ఏర్పాటు చేశారు. తమిళ తల్లి, స్వాతంత్ర్య పోరాటయోధుల కటౌట్లు కూడా పెట్టారు. 1,100 విద్యుత్తు దీపాలు అమర్చారు.

● పార్టీ జెండా ఆవిష్కరణకు వీలుగా 101 అడుగుల ఇనుప స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జెండా సుమారు 5 ఏళ్ల పాటు ఎగరడానికి వీలుగా ఆ భూములున్న రైతులతో పార్టీ ఒప్పందం కుదుర్చుకుంది. పార్టీ నిర్వాహకులు మహానాడు విజయవంతానికి యాగపూజలు చేశారు.

2026 లక్ష్యంవైపు తొలి అడుగు వేద్దాం

విజయ్ పిలుపు

చెన్నై, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల లక్ష్యంవైపు తొలి అడుగు వేద్దామంటూ కార్యకర్తలకు తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ పిలుపునిచ్చారు. ఆయన తన ప్రకటనలో... మహానాడు జరిగే సమయం దగ్గరపడిందని తెలిపారు. ప్రతి ఒక్కరిని ప్రత్యక్షంగా చూడనున్న ఆ సందర్భాన్ని చెప్పడానికి తన వద్ద మాటల్లేవన్నారు. సురక్షితంగా, నిబంధనలు పాటిస్తూ మహానాడుకు రావాలని సూచించారు.

6 వేల మందితో భద్రత

సుమారు 1500కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రైవేటు భద్రతా సంస్థ మహానాడు ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకొంది. విళుపురం జిల్లా పోలీసు యంత్రాంగం తరఫున నార్త్ జోన్ ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో డీఐజీ దిషా మిట్టల్ పర్యవేక్షణలో ఇద్దరు డీఐజీలు, 10 మంది ఎస్పీలు, 15 మంది ఏడీఎస్పీలు, 50 మంది డీఎస్పీలు సహా 6వేల మంది పోలీసులతో భద్రత కల్పించనున్నారు.



సీఎం పినరయి విజయన్‌కు చెక్కు అందిస్తున్న భరణీధరన్

వయనాడు బాధితులకు ఆర్థికసాయం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం వయనాడులో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది మృతిచెందారు. చాలామంది నిరాశ్రయుల య్యారు. బాధితులను ఆదుకోవడానికి తిరువళ్లూరు, తాంబరంలోని శ్రీని కేతన్ పాఠశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. ఆ మేరకు విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది నుంచి రూ.18 లక్షల విరాళాలు సేకరిం చారు. ఇందుకు సంబంధించిన చెక్కును పాఠశాల డైరెక్టర్ భరణీధరన్ కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు శుక్రవారం అందజేశారు. పాఠశాల విద్యార్థులు గతంలో ఉత్తరాఖండ్‌లో వరదలేర్పడినప్పుడు, వర్ద తుపాను, గజ తుపాను బాధితులకు సాయం అందించారు.

◆ ప్రతికూల వాతావరణం

గాల్లో చక్కర్లు కొట్టిన రెండు విమానాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రతికూల వాతావరణం కారణంగా మదురై విమానాశ్రయంలో ల్యాండ్ కాలేక రెండు విమానాలు చాలాసేపు గాల్లో చక్కర్లు కొట్టి సురక్షితంగా కిందికి దిగాయి. మదురైలో కొన్ని రోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో పలు ప్రాంతాల్లో బలమైన గాలులు, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో బెంగళూరు, చెన్నై నుంచి మదురైకి వచ్చిన ఇండిగో విమానాలు విమానాశ్రయంలో ల్యాండ్ కాలేకపోయాయి. చెన్నై నుంచి రాత్రి 7.20 గంటలకు బయలుదేరిన మదురై విమానం 8.20కి మదురైలో ల్యాండ్ కావాలి. అదేవిధంగా బెంగళూరు నుంచి రాత్రి 7.40కి బయలుదేరిన విమానం మదురైలో 8.35కి ల్యాండ్ కావాల్సి ఉంది. భారీవర్షం, గాలి కారణంగా దిగలేక తేని, ఉసిలంపట్టి, ఆండిపట్టి వద్ద ఆకాశంలోనే తిరిగాయి. అనంతరం గంట తర్వాత 9.50 గంటలకు విమానాశ్రయంలో సురక్షితంగా కిందికి దిగాయి.

జలవనరుల నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం



పాల్గొన్న అదనపు ప్రధాన కార్యదర్శి కె.మణివాసన్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: సాంకేతికతతో సక్రమంగా జలవనరుల నిర్వహించి సంక్షోభాల బారినపడకుండా తమిళనాడు ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర జలవనరుల విభాగ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్ పేర్కొన్నారు. 'సౌత్ వేవ్ ట్రాన్స్‌ఫార్మింగ్ వాటర్ ఛాలెంజస్ ఇన్‌టు ఆపర్చునిటీ' అనే అంశంపై 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సీఐఐ) ఆక్వా దక్షిణ విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి మణివాసన్ హాజరయ్యారు. రాష్ట్రంలో 40వేల జలవనరులున్నాయని, నీటి డాటా గురించి తెలుసుకునేందుకు త్వరలోనే రియల్ టైమ్ డాటా అందుబాటులోకి రానుందన్నారు. 'జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ' (జేఐసీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్త మాస్టర్ ప్లానులో రుతుపవనాల సమయంలో సంభవించే వరదలను నియంత్రించి, వ్యవసాయ భూములకు జలవనరులు పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఊహించని విధంగా జరుగుతున్న వాతావరణ మార్పులతో, సమర్థంగా ఎదుర్కోవడానికి భాగస్వామ్యం చాలా అవసరమని యూఎస్ కాన్సుల్ జనరల్ క్రిస్ హోడ్జెస్ పేర్కొన్నారు. కేంద్ర భూగర్భ జలాల బోర్డు సేకరించిన డాటా మేరకు 2050 నాటికి భూగర్భ జలాలు రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం మేరకు మాత్రమే ఉంటాయని తెలుస్తోందన్నారు. తగినంత వానలు కురవక భూగర్భ జలాల సమస్య ఏర్పడే అవకాశాలు లేకపోలేదన్నారు. తరచూ సంభవించే వరదలు, బెంగళూరు జలాల్లో శుద్ధిచేయని మురుగునీటితో 60శాతం కాలుష్యం కనిపిస్తోందన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 'సిరుత్తులి', 'నల్లతన్ని' మీద భావితరాల కోసం దృష్టి సారించాలని సీఐఐ దక్షిణ ప్రాంత కోఛైయిర్ వనితా మోహన్ తెలిపారు. గ్రౌండ్‌ఫాస్ పంప్స్ లిమిటెడ్, దేశ అధ్యక్షురాలు ఉషా సుబ్రమణియం, సీఐఐ దక్షిణ ప్రాంత కోఛైయిర్ సుదీప్ దాల్వి ప్రసంగించారు.

పోలీసుల తీరుకు నిరసనగా ఎంపీ ధర్నా




ఎంపీ సీవీ షణ్ముగం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అక్కడ ఎస్పీ లేకపోవడంతో విజిటర్స్ గదిలో వేచి ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి ఉన్నా ఎస్పీ రాలేదు. దీంతో ఓపిక నశించి ఆగ్రహించిన ఆయన కలెక్టరు కార్యాలయం ప్రవేశమార్గంలో ధర్నాకు దిగారు. ఎస్పీ వచ్చే వరకు కొనసాగిస్తానని చెప్పారు. తర్వాత పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యుడినైన తాను పోలీసులకు ఇచ్చే ఫిర్యాదులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తనకే ఈ పరిస్థితి ఎదురైతే సామాన్య ప్రజల స్థితి ఏలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు.

అడయారు జంక్షన్‌లో ట్రాఫిక్ మార్పులు

ప్యారిస్, న్యూస్‌టుడే: మెట్రో రైలు పనుల కారణంగా అడయారు జంక్షన్‌లో 26, 27 తేదీల్లో ప్రయోగాత్మకంగా ట్రాఫిక్‌లో మార్పులు చేసినట్లు గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. ❖ సర్దార్ వల్లభాయ్ పటేల్ రోడ్డు నుంచి గ్రీన్‌వేస్ సాలై, మెరీనా బీచ్, మైలాపూర్‌కి వచ్చే వాహనాలు అడయారు బస్ డిపో జంక్షన్‌లో గాంధీనగర్ రెండో క్రాస్ వీధి వైపుగా రామచంద్ర ఆదిత్తనార్ రోడ్డులో ఎడమవైపు వెళ్లి దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ రోడ్డు చేరుకుని ఎడమవైపు వెళ్లి తిరువిక వంతెన వైపుగా వెళ్లి తమ గమ్యాన్ని చేరుకోవచ్చు. ❖ వన్‌వేగా ఉన్న అడయారు వంతెనను టూవేగా మార్చారు. ❖ తిరువిక సాలై వంతెన నుంచి అడయారు, తిరువాన్మియూర్, బెసంట నగర్, ఓఎమ్మార్, మధ్య కైలాష్ వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆంక్షలు లేవు. ❖ ఎస్‌వీ పటేల్ రోడ్డు నుంచి ఎల్‌బీసాలై వైపుగా అడయారు, తిరువాన్మియూర్, బెసంట్ నగర్ వెళ్లే వాహనాలకు ఎలాంటి ట్రాఫిక్ మార్పులు లేవు. ❖ ఎల్‌బీ సాలై వైపుగా గ్రీన్‌వేస్ సాలై, మెరీనా బీచ్, మైలాపూర్, గిండి వెళ్లే వాహనాలు ఎప్పటిలాగానే వెళ్లవచ్చు. ❖ బెసంట్ నగర్ నుంచి గ్రీన్‌వేస్ సాలై, మెరీనా బీచ్, మైలాపూర్ వెళ్లే వాహనాలు ఎప్పటిలానే వెళ్లవచ్చు.



ట్రాఫిక్ మార్పులు సూచించే మ్యాప్

నిరుపేద పిల్లలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ జీవీ సంపత్. చిత్రంలో కేటీ శ్రీనివాస రాజా తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: 'నరువి హాస్పిటల్స్', 'అడయార్ ఆనంద్ భవన్' (ఏటూబీ) సంస్థలు కలిసి నిరుపేద కుటుంబాలకు చెంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నాయి. ఇందుకుగాను అడయార్ ఆనంద్ భవన్ సీఎస్ఆర్ నిధులు వెచ్చిస్తుందని నరువి ఆసుపత్రుల వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ జీవీ సంపత్, ఏటూబీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేటీ శ్రీనివాస రాజా శుక్రవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వేలూరు, రాణిపేట, తిరుపత్తూరు, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు 10 మందికి చికిత్స అందించనున్నట్టు డాక్టర్ సంపత్ తెలిపారు. 87540 47796 నెంబరుపైగాని లేదా నేరుగా గానీ ఆసుపత్రిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్డియోథొరాయిసిక్, వాస్క్యులర్ సర్జరీ (సీటీవీఎస్) విభాగ హెడ్, డాక్టర్ వినాయక్ శుక్లా, డాక్టర్ రే జార్జి, డాక్టర్ ఈశ్వర కార్తీక్, డాక్టర్ జాఫర్ దరఖాస్తులు పరిశీలించి, అర్హులైన పిల్లలకు చికిత్స అందిస్తారని పేర్కొన్నారు.



వేదికపై న్యాయమూర్తి రమేష్ తదితరులు

కొత్త క్రిమినల్ చట్టాలపై జాతీయ సదస్సు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కోసం జాతీయ సదస్సు తిరువళ్లూరులోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ జయపాల్ అధ్యక్షత వహించారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలతో కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి నిందితులకు శిక్ష విధించవచ్చని తెలిపారు. దీర్ఘకాలం పాటు శిక్ష అనుభవిస్తున్న, సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సంబంధించి విపులంగా వివరించారు. కళాశాల అధ్యాపకులు ఆనంది, విజయ్ పాల్గొన్నారు.

దీపావళికి విమాన టిక్కెట్లపై రాయితీ

వడపళని, న్యూస్‌టుడే: దీపావళి పండుగ పురస్కరించుకుని 'ఎయిరిండియా' సంస్థ ప్రధాన నగరాలకు రాయితీతో కూడిన టిక్కెట్లను విక్రయిస్తోంది. నవంబరు 1 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు ప్రయాణించే వారు రాయితీ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. అక్టోబరు 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. అగర్తలా - గువాహటి, కొచ్చి - బెంగళూరు, చెన్నై - బెంగళూరు, విజయవాడ - హైదరాబాదు మార్గాలకు రాయితీతో కూడిన టిక్కెట్ల ధరలు రూ.1,606తో ప్రారంభమవుతుంది. ఎయిరిండియా వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకునేటయితే రూ.1,456 నుంచి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



శామ్యువేల్‌ను సత్కరిస్తున్న వీసీకే నాయకులు

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన వృద్ధుడు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప కైవండూరుకు చెందిన శామ్యువేల్ (75) చిరుప్రాయం నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్నారు. ప్రధానంగా అథ్లెటిక్స్‌లో 200కి పైగా పతకాలు సాధించారు. ఈనెల 12, 13 తేదీల్లో మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని బుకిట్‌జెల్లి మైదానంలో 75 ఏళ్ల కేటగిరీలో వృద్ధుల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. 30 దేశాలకు చెందిన వృద్ధులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి పది మంది బరిలోకి దిగారు. శామ్యువేల్ లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్ పోటీల్లో తలపడి 2 బంగారు, ఓ వెండి పతకం సాధించి సత్తాచాటారు. శుక్రవారం రాష్ట్రానికి చేరుకున్న ఆయన్ను వీసీకే నాయకులు ఆనందన్, శ్రీనివాసన్ సత్కరించారు.

ఈపీఎస్ వారం రోజుల్లో జవాబివ్వాలి: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ భారతి దాఖలు చేసిన పరువునష్టం కేసులో వారంరోజుల్లో జవాబివ్వాలని ఎడప్పాడి పళనిసామికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మత్తుపదార్థాల కేసులో ఢిల్లీ పోలీసులు జాఫర్ సాదిక్‌ను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో డీఎంకేతో జాఫర్ సాదిక్‌కు సంబంధం ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి తన ఎక్స్ పేజీలో పోస్టు చేశారు. రూ.కోటి పరిహారం చెల్లించాలని ఉత్తర్వులు ఇవ్వాలని కోరి డీఎంకే తరఫున డీఎంకే సంస్థాగత కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి మద్రాసు హైకోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. మత్తుపదార్థాల కేసులో జాఫర్ సాదిక్‌ను అరెస్టు చేసిన తర్వాత అతన్ని పార్టీ నుంచి తొలగించినట్లు తెలిపారు. పార్టీకి కళంకం తెచ్చేలా అనుచిత వ్యాఖ్యలను పోస్టు చేయడానికి ఎడప్పాడి పళనిసామికి నిషేధం విధించాలని తెలిపారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. వారంరోజుల్లో ఎడప్పాడి పళనిసామి జవాబివ్వాలని ఉత్తర్వు ఇచ్చి విచారణ వాయిదా వేశారు.

విజయ్‌కు వెంకట్ ప్రభు శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం తొలి రాష్ట్ర మహానాడు జరగనున్న సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్‌కు దర్శకుడు వెంకట్ ప్రభు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో పంచుకున్న వీడియో సందేశంలో... 'అన్నా మీ ముందున్న సుదూర ప్రయాణానికి నా శుభాకాంక్షలు. మా అందరికీ మీరు అతిపెద్ద ప్రేరణ' అని తెలిపారు.

ఏ పార్టీని ఎవరూ నాశనం చేయలేరు: సెల్వపెరుంతగై



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రజలు అనుకుంటే తప్ప ఏ పార్టీ బలహీనపడదని, ఎవరూ నాశనం చేయలేరని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తెలిపారు. ఆయన పుదుకోట్టైలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... చెన్నైలో రూ.4వేల కోట్లతో చేపట్టిన వరద నివారణ చర్యల గురించి సమాచార హక్కు చట్టం కింద ప్రస్తుతం సమాచారం విడుదలైందని పేర్కొన్నారు. టీవీకే మహానాడులో అంబేద్కర్, కామరాజర్ కటౌట్ ఏర్పాటు చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కానీ, విజయ్ చర్యలు, ఆయన మాటలు, ఆచరణలు రానున్న కాలాలలోనే తెలియనున్నాయని తెలిపారు. అన్నాడీఎంకేని భాజపా నాశనం చేస్తుందని తాము ఆరోపిస్తున్నామని, అందుకు నిదర్శనంగానే ఎడప్పాడి కుడిభుజంగా ఉన్న రాజేంద్రన్ ఇంటిపై ఆదాయపు పన్నుశాఖ దాడులు నిర్వహించిందన్నారు. అలానే భాజపా మద్దతుదారుడిగా ఉన్న ఓపీఎస్ వర్గ నేత వైద్యలింగం ఇంట్లో ఈడీ దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఇకనైనా అన్నాడీఎంకే, ఓపీఎస్ దీనిని అర్థం చేసుకోవాలని తెలిపారు. ఎవరూ ఏ పార్టీని నాశనం చేయలేరన్నారు. ఏదైనా ప్రజల చేతుల్లోనే ఉందన్నారు.

మహిళా జైళ్లలో అధికారిణులను నియమించాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: మహిళా జైళ్లలో అధికారిణులను నియమించాలని దాఖలైన కేసులో ప్రభుత్వం, జైళ్ల శాఖ డీజీపీ జవాబివ్వాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వేలూర్, కోయంబత్తూరు, సేలం, మదురైలో మహిళా ప్రత్యేక జైళ్లు ఉన్నాయి. మహిళా సూపరింటెండెంట్‌లను నియమించాలని లాయరు పుగళేంది మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ జైళ్లలో సూపరింటెండెంట్లుగా పురుషులను నియమిస్తుండటంతో మహిళా ఖైదీలు సమస్యలు చెప్పలేకపోతున్నారని తెలిపారు. ఈ పిటిషన్ చీఫ్ జస్టిస్ కేఆర్ శ్రీరామ్, జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి ధర్మాసనంలో విచారణకు వచ్చింది. మహిళా జైళ్లలో ఉన్న ఖాళీ పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ప్రభుత్వ ప్లీడర్ జవాబిస్తూ.. వేలూర్ మినహా మిగిలిన మహిళా జైళ్లలో పురుష అధికారులు ఉన్నారని, వేలూర్‌లోనూ అధికారిణులను త్వరలో నియమిస్తామన్నారు. తదుపరి విచారణ నవంబరు 14కు వాయిదా వేశారు.

చిదంబరం ఆలయ ఆస్తులు దీక్షితులు విక్రయించినట్లు ఆధారాలు దాఖలు

ప్యారిస్, న్యూస్‌టుడే: చిదంబరం నటరాజర్ ఆలయ ఆస్తులను దీక్షితులు విక్రయించారన్న వ్యవహారంలో దేవాదాయశాఖ మద్రాసు హైకోర్టులో ఆధారాలు దాఖలు చేసింది. ఆలయ ఆదాయ లెక్కలు అందించాలని దేవాదాయశాఖ కమిషనర్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. అప్పుడు దీక్షితుల తరఫున..ఆలయ భూములు దీక్షితుల ఆధీనంలో లేవని, ఏ భూమిని విక్రయించలేదని, ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. ఆలయ ఆస్తులపై విచారణకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం దేవాదాయ శాఖ తరఫున.. ఆలయ భూములను 1974, 1985, 1988 సంవత్సరాల్లో దీక్షితులు విక్రయించారన్నందుకు ఆధారాలు ఉన్నాయని తెలిపి నివేదిక దాఖలు చేశారు. దేవాదాయశాఖ నివేదికపై జవాబివ్వాలని దీక్షితుల తరఫువారికి ఉత్తర్వులు ఇచ్చి తదుపరి విచారణ నవంబరు 14కు కోర్టు వాయిదా వేసింది.

త్వరలో గ్రూప్-4 ఫలితాల విడుదల

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షా ఫలితాలు ముందుస్తు ప్రణాళిక ప్రకారం అక్టోబర్ నెలాఖరులోగా విడుదల చేస్తామని టీఎన్‌పీఎస్సీ ఛైర్మన్ ప్రభాకర్ తెలిపారు. పలు శాఖల్లో ఖాళీగా ఉన్న 6,244 పోస్టులకు జూన్ 9న పరీక్ష నిర్వహించారు. తర్వాత మరో 2,208 పోస్టులను జతచేశారు. ఇదిలా ఉండగా పరీక్షా ఫలితాల విడుదల గురించి సభ్యులతో సమావేశం రానున్న 27వ తేదీ జరగనున్నట్లు సమాచారం. దీని గురించి ఛైర్మన్ ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. ముందుగా అనుకున్నట్లే ఫలితాలు అక్టోబర్ నెలాఖరులోగా విడుదల చేస్తామని పేర్కొన్నారు.

మదురై రైల్వే జోన్ విలీనం తగదు: ఎస్‌డీపీఐ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మదురై రైల్వే జోన్‌ను తిరువనంతపురం జోన్‌లో విలీనం చేయరాదని ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు నెల్లై ముబారక్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. అలా చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వందలాది మంది రైల్వేశాఖలో ఉద్యోగాలు పొందలేని పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా రాష్ట్రానికి చెందిన యువకులు ఉద్యోగాలు పొందలేని విధంగా ఉన్న ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

మద్రాస్ వర్సిటీలో ప్రత్యేక కోర్సు

వడపళని, న్యూస్‌టుడే: కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ప్రవేశపెట్టిన 'గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' కింద మద్రాసు వర్సిటీ 'వేస్ట్ ఆప్టిమైజేషన్ ప్రొఫెషనల్' కోర్సును అందిస్తున్నట్టు ఓ ప్రకటన విడుదల చేసింది. ఉచితంగా అందించే ఈ సర్టిఫికెట్ కోర్సు 570 గంటల పాటు (సుమారుగా మూడు నెలలు) ఉంటుందని, 2024-25 సంవత్సరానికి నవంబరు మూడో వారంలో తరగతులు ప్రారంభించి 2025 ఫిబ్రవరి చివరికి ముగించాలనుకుంటున్నట్టు వర్సిటీ పేర్కొంది. పైన తెలిపిన రంగంలో అభ్యర్థులకు నాలుగేళ్ల యూజీ డిగ్రీ కలిగి, ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారు అర్హులు. పర్యావరణం, అడవికి సంబంధించిన దాంట్లో మూడేళ్ల యూజీ డిగ్రీ చదివిన, ప్లస్‌టూ, రెండేళ్ల డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు కూడా చేరొచ్చు. ఉచితంగా అందించే కోర్సుకు అర్హులైన వారికి ఉచిత బస, భోజన సదుపాయాలు కూడా ఉంటాయని, నవంబరు 7వ తేదీ దరఖాస్తుకు తుది గడువు.

నేడు కంచికి విచ్చేయనున్న శృంగేరి పీఠాధిపతి



శ్రీ విదుశేఖర భారతి

కాంచీపురం, న్యూస్‌టుడే: ఆదిశంకరాచార్యులు స్థాపించిన శృంగేరి పీఠం 37వ అధిపతి జగద్గురు శ్రీ విదుశేఖర భారతి 'విజయయాత్ర-2024' నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన శనివారం మధ్యాహ్నం బెంగళూర్ నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు కాంచీపురంలోని శృంగేరి పీఠానికి చేరుకుంటారు. ఆదివారం కాంచీపురంలో ఆయనకు శృంగేరి పీఠం భక్తులు పాదపూజ నిర్వహిస్తారు. తరువాత చంద్ర మౌళీశ్వరుడి పూజల్లో పాల్గొంటారు. 28వ తేదీ ఇక్కడి నుంచి బయలుదేరి చెన్నైకు చేరుకొని నవంబరు 13 వరకు అక్కడ బస చేసి అనేక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: వివిధ ఘటనల్లో మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ సాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ప్రయాణికుడి దాడిలో వ్యాసర్పాడి బస్ డిపోకు చెందిన కండక్టరు జగన్‌కుమార్ గురువారం మృతి చెందారు. ఆయన కుటుంబానికి, తోటి సిబ్బందికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలను సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని ఆదేశించారు. తిరునెల్వేలి జిల్లా వీరనల్లూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై సుబ్బయ్య(57) రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరునెల్వేలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ప్రాణాలు కోల్పోయారు. ఆయన కుటుంబానికి రూ.20లక్షల సాయం అందించాలని ఆదేశించారు.

కామాక్షమ్మ ఆలయ హుండీల లెక్కింపు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురంలోని ప్రసిద్ధ కామాక్షి అమ్మవారి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మూడు నెలలకోసారి లెక్కిస్తారు. ఆ మేరకు రెండు రోజులుగా ఆలయ ఈవో శ్రీనివాసన్, ఆలయ శ్రీకార్యం సుందేశ అయ్యర్, మనేగార్ సూర్యనారాయణన్, దేవాదాయ శాఖ కమిషనర్ కార్తికేయన్, ఇన్‌స్పెక్టరు ప్రీతిక నేతృత్వంలో ఆలయ సిబ్బంది, వాలంటీర్లు లెక్కించారు. ఈ సందర్భంగా రూ.59,16,361 నగదు, 163 గ్రాముల బంగారం, 432 గ్రాముల వెండి ఆదాయంగా లభించినట్లు ఈవో తెలిపారు.



చెన్నై గిండిలోని డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో గ్లోబల్ ఆయుర్వేద ఆవిష్కరణలు, ఇంటిగ్రేషన్‌లపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. పాల్గొన్న ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ 150 పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. - ఆర్కేనగర్, న్యూస్‌టుడే

ఉత్తర చెన్నై అభివృద్ధికి 28 ప్రాజెక్టులు



మాట్లాడుతున్న మంత్రి శేఖర్‌బాబు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఉత్తర చెన్నై అభివృద్ధికి సీఎండీఏ తరఫున రూ.685 కోట్ల వ్యయంతో 28 ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు సీఎండీఏ ఛైర్మన్, మంత్రి శేఖర్‌బాబు పేర్కొన్నారు. ఆ మేరకు రూ.12.68 కోట్ల వ్యయంతో తిరువిక నగర్, కన్నికాపురం స్పోర్ట్స్ గ్రౌండ్ అభివృద్ధి, రూ.12 కోట్ల వ్యయంతో పురసైవాక్కం, లాండ్రో మ్యాట్ అభివృద్ధి, తిరువిక నగర్‌లో రూ.5.35 కోట్ల వ్యయంతో బస్టాండ్ నిర్మాణం, జగన్నాథన్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ సెంటర్ పనులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తర చెన్నైలో సీఎండీఏ తరఫున 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో కేటాయించిన నిధులతో 140 అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఇందులో బీచ్‌లు, సరస్సుల అభివృద్ధి, బస్టాండు నిర్మాణం, రెసిడెన్షియల్ మార్కెట్లు, అదనపు తరగతి గదుల నిర్మాణం మొదలైన 28 పనులు రూ.638 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యే తాయగం కవి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా తదితరులు ఉన్నారు.

సభాపతి అప్పావుపై పరువునష్టం దావా కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: సభాపతి అప్పావుపై దాఖలైన పరువునష్టం దావాను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. జయలలిత మరణం తర్వాత 40 మంది ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు మాట్లాడినందుకు అప్పావుపై అన్నాడీఎంకే న్యాయవాదుల విభాగం జాయింట్ కార్యదర్శి బాబు మురుగవేల్ పరువునష్టం దావా దాఖలు చేశారు. దావా రద్దు చేయాలని అప్పావు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. శుక్రవారం విచారణకు వచ్చింది. ఫిర్యాదుదారుడు వ్యక్తిగతంగా దావా దాఖలు చేశారని, పార్టీ అతనికి ఎలాంటి అధికారం ఇవ్వలేదని న్యాయమూర్తి తెలిపారు. పరువునష్టం దావా కొట్టివేస్తూ ఉత్తర్వు ఇచ్చారు.

అన్నాడీఎంకే నిర్వాహకుడికి సీబీసీఐడీ సమన్లు



సజీవన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలితకు చెందిన నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌లో 2017లో హత్య, దోపిడీ చోటుచేసుకున్నాయి. దీనిపై సీబీసీఐడీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు విచారణ ఊటీ కోర్టులో జరుగుతోంది. ఈ నేపథ్యంలో హత్య కేసు విచారణకు హాజరుకావాలని దుబాయిలో ఉంటున్న అన్నాడీఎంకే రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు సజీవన్‌కు సీబీసీఐడీ సమన్లు పంపింది. కూడలూర్ సమీపంలోని అళ్లూర్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడడానికి తన పనివారికి నకిలీ తుపాకీ తీసిచ్చిన కేసులో 3వ నిందితుడిగా సజీవన్‌ని చేర్చడంతో గత ఏప్రిల్‌లో దుబాయ్ వెళ్లి తలదాచుకున్నాడు.

సిండికేట్ సభ్యురాలి నియామకంలో తప్పులేదు



మాట్లాడుతున్న అప్పావు

సైదాపేట, న్యూస్‌టుడే: తిరునెల్వేలి మనోన్మణియం సుందరరాజన్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీకి చెందిన సవితా రాజేష్‌ను సిండికేట్ సభ్యురాలిగా నియమించటంలో తప్పులేదని అసెంబ్లీ స్పీకర్ అప్పావు తెలిపారు. తిరునెల్వేలి ప్రభుత్వాస్పత్రిలో రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రత్యేక అతిథిగా అప్పావు పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ. . దక్షిణ జిల్లాలోని తీర గ్రామాల్లో క్యాన్సర్ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇసుక, రేడియేషన్, కూడంకులం అణు విద్యుత్ కేంద్రం అందుకు కారణమని అన్నారు. అణు వ్యర్థాలను రాజస్థాన్ ఎడారి వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి నిర్వీర్యం చేయాలని సూచించారు. వర్సిటీల్లో సిండికేట్ సభ్యులను నియమించేందుకు గవర్నర్‌కు అధికారం ఉందన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సామినాథన్

ప్రజా సంబంధాలశాఖపై సమీక్ష

చెన్నై, న్యూస్‌టుడే: ప్రజా సంబంధాలశాఖ పనితీరుపై ఆ శాఖ మంత్రి సామినాథన్ శుక్రవారం కలైవాణర్ ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. చెన్నై, తిరుచ్చిరాపల్లి, తంజావూర్ జోనల్ జాయింట్ డైరెక్టర్లు, ఆ జిల్లాల సమాచార ప్రజా సంబంధాలశాఖ అధికారులు పాల్గొన్నారు. జోన్లవారీగా శాఖ పనితీరు గురించి మంత్రి చర్చించారు. సమావేశంలో తమిళాభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, సమాచార ప్రజా సంబంధాలశాఖ సంచాలకులు వైద్యనాథన్, అదనపు సంచాలకులు అన్బుచోళన్ (ప్రజా సంబంధాలు), సెల్వరాజ్ (సమాచారం), సమాచారశాఖ ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు.



లోకేశ్ కనకరాజ్, కార్తి

ఖైదీ-2కి సంకేతమిచ్చిన లోకేశ్ కనకరాజ్


చెన్నై, న్యూస్‌టుడే: కార్తి, నరేన్ ప్రధాన పాత్రల్లో నటించి 2019లో విడుదలైన చిత్రం 'ఖైదీ'. ఈ చిత్రానికి లోకేశ్ కనకరాజ్ కథ రాసి, దర్శకత్వం వహించారు. ఈ చిత్రం లోకేశ్ కనకరాజ్ సినీ ప్రస్థానంలో కీలక మలుపుగా నిలిచింది. చిత్రం విడుదలై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా లోకేశ్ కనకరాజ్ శుక్రవారం తన 'ఎక్స్' పేజీలో తన మనోభావాలను పంచుకున్నారు. అందులో 'అంతా ఇక్కడి నుంచే ప్రారంభమైంది. కార్తి, నిర్మాత ఎస్సార్ ప్రభుకు కృతజ్ఞతలు. వారి వల్లే 'లోకేశ్ యూనివర్స్' సాధ్యమైంది. త్వరలో ఢిల్లీ తిరిగి వస్తారు' అంటూ పేర్కొన్నారు. 'ఖైదీ' చిత్రంలో కార్తి నటించిన పాత్ర పేరు ఢిల్లీ కావడం గమనార్హం. ఈ సందేశం ద్వారా 'ఖైదీ-2'కి ఆయన సంకేతాలు పంపారు.

అరణ్మనై-5 చిత్రీకరణకు సన్నాహాలు



చెన్నై: దర్శకనటుడు సుందర్.సి 2014లో రూపొందించిన 'అరణ్మనై' చిత్రం విజయం సాధించడంతో ఇప్పటివరకు దానికి నాలుగు భాగాలను రూపొందించారు. ఈ నేపథ్యంలో 'అరణ్మనై-5' చిత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించింది. చిత్రానికి హిప్ హాప్ తమిళ ఆది సంగీతం సమకూర్చనున్నారు. నవంబరు ఆఖరు లేదా డిసెంబరులో చిత్రీకరణ పనులు ప్రారంభం కావచ్చని, వచ్చే ఏడాది వేసవి సెలవులకు చిత్రాన్ని విడుదల చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. నటీనటులు, సాంకేతిక కళాకారుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

కూలీ చిత్రీకరణలో రజనీకాంత్



చెన్నై: లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ ప్రధాన పాత్రలో 'కూలీ' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. చిత్రీకరణ పనుల్లో పాల్గొని చెన్నై తిరిగి వచ్చిన రజనీకాంత్‌కు సెప్టెంబరు 30న అపోలో ఆస్పత్రిలో రజనీకాంత్ గుండెకు స్టంట్ వేయడంతో చికిత్స తర్వాత ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ మళ్లీ చిత్రీకరణలో పాల్గొన్నారు. ఓ.ఎం.ఆర్ రోడ్డులోని ఆదిత్య రామ్ షూటింగ్ స్పాట్‌లో భారీ సెట్ వేసి పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాల్లో రజనీకాంత్ పాల్గొన్నారు.

మరికొన్ని సినీ విశేషాలు

■ వర్ధమాన దర్శకుడు ప్రేమ్‌నాథ్ దర్శకత్వంలో మహద్ రాఘవేంద్ర, మీనాక్షి జంటగా నటించిన చిత్రం 'కాదలే కాదలే'. శ్రీవారి ఫిలిమ్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు. చిత్రం తొలి పాటను చిత్రబృందం విడుదల చేసింది.

■ వర్ధమాన దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వంలో అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటిస్తున్న చిత్రం 'వన్స్ మోర్'. మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రంలోని 'మిస్ ఒరుత్తి' పాటను చిత్రబృందం విడుదల చేసింది. చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది.

■ జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ ప్రధాన పాత్ర పోషించిన 'వేట్టైయన్' ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ పొందింది. నవంబరు 7న చిత్రాన్ని ఓటీటీలో విడుదల చేయనుంది. డిజిటల్ హక్కులను రూ.90 కోట్లకు కొనుగోలు చేసినట్టు సమాచారం.

■ శీను రామసామి దర్శకత్వంలో ఏగన్, యోగిబాబు, కొత్త నటీనటులతో రూపొందిన చిత్రం 'కోళిపణ్ణై చెల్లదురై'. ఇప్పటికే సినిమా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఓటీటీ ప్లాట‌ఫాంపై గురువారం విడుదలైంది. దీనిని సింప్లి సౌత్ విడుదల చేసింది.



'మిస్ ఒరుత్తి' పాటలోని సన్నివేశం

■ హిప్ హాప్ తమిళ ఆది దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు చేపట్టి నటించిన చిత్రం 'కడైసి ఉలగ పోర్'. ఇప్పటికే సినిమా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రాన్ని అమెజాన్ ప్రైమ్ గురువారం ఓటీటీ ప్లాట్‌ఫారంపై విడుదల చేసింది.



ఐందరువిలో నీటి ఉద్ధృతి

హొగినేకల్‌కు పెరిగిన నీటిరాక

విల్లివాక్కం, న్యూస్‌టుడే: హొగినేకల్ వద్ద కావేరి నదికి శుక్రవారం నీటి రాక 35 వేల ఘనపుటడుగులకు పెరిగింది. దీంతో ప్రధాన జలపాతం, సినీ ఫాల్స్, ఐందరువి తదితర జలపాతాలలో నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పర్యాటకుల సందర్శనను 13వ రోజూ నిషేధం విధించారు. తెప్పల షికారు నిలిపేశారు. నదిలో స్నానం చేయకూడదని పోలీసులు ప్రకటిస్తూ భద్రతా విధులు చేపట్టారు.

గవర్నర్ వ్యాఖ్యలకు బదులిచ్చిన మంత్రి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి కొడైకెనాల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలకు వెళ్లినప్పుడు విద్యార్థులతో మాట్లాడుతూ.. టేబుల్‌పై సరస్వతి మాత చిత్రపటాన్ని ఉంచి నమస్కరించుకుని చదివితే చక్కగా జ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం మారాయి. ఈ నేపథ్యంలో మంత్రి అన్బిల్ మహేశ్ తన ఎక్స్ పేజీలో.. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన పెంపొందించడం కర్తవ్యంగా ఉండాలి అంటూ పోస్టు పెట్టారు.

ఆస్కాలో రేపు 'తరతరాల తెలుగు కవిత'

వడపళని, న్యూస్‌టుడే: వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' కార్యక్రమంలో భాగంగా ఆదివారం 'విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం - పద్యశిల్పం' అంశంపై ఉపన్యాసం జరగనుంది. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం వాస్తవ్యులు, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు ప్రసంగిస్తారని నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6.30కు జరిగే కార్యక్రమానికి టీనగర్ విజయరాఘవ రోడ్డులోని ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలు వేదిక. సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులే.

సీర్ మరబినర్ సంక్షేమబోర్డు సమావేశం



సమావేశంలో పాల్గొన్న మంత్రి మెయ్యనాథన్, అధికారులు

సైదాపేట, న్యూస్‌టుడే: సీర్ మరబినర్ సంక్షేమ బోర్డు మొదటి సమావేశం చెన్నై ఎళిలగంలోని వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, సీర్‌మరబినర్ సంక్షేమ డైరెక్టరేట్ సమావేశ హాలులో శుక్రవారం జరిగింది. దీనికి మంత్రి మెయ్యనాథన్ నేతృత్వం వహించారు. శాఖ కార్యదర్శి విజయరాజ్‌కుమార్, బోర్డు అధ్యక్షుడు రాజా అరుణ్ మొళి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ మద్దతు

చెన్నై, న్యూస్‌టుడే: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం మద్దతు అందిస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో గురువారం సాయంత్రం జరిగిన 'ముఖ్యమంత్రి ట్రోఫీ క్రీడా పోటీలు-2024' ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ఎక్కువ పతకాలు పొంది తొలిస్థానంలో నిలిచిన చెన్నై జిల్లా జట్టు తరఫున కలెక్టరు రష్మి సిద్ధార్థ్, క్రీడాకారులు, జోనల్ సీనియర్ మేనేజర్, జిల్లా క్రీడాధికారికి ట్రోఫీని ముఖ్యమంత్రి అందించారు. రెండో బహుమతి చెంగల్పట్టు జిల్లా జట్టుకు, మూడో బహుమతిని కోయంబత్తూర్ జిల్లా జట్టుకు అందించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. డీఎంకే అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో క్రీడారంగానికి పెద్దపీట వేసిందని, క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తోందని వివరించారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి, కొత్త రికార్డులు సృష్టించడానికి, అవకాశాలు పొందేందుకు 'ముఖ్యమంత్రి ట్రోఫీ' పోటీలు మార్గం సుగమం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఉదయనిధి, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధిశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చెన్నై జిల్లా జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

న్యాయవాదిని అరెస్టు చేయాలని ఆందోళన





రెడ్‌హిల్స్: ఎస్పీ కార్యాలయం ఎదుట గుమిగూడిన బాధితులు ◆ అరక్కోణం: అధికారితో మాట్లాడుతున్న ఆందోళనకారులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప రాజాజీపురం పెరియార్‌నగర్‌కు చెందిన హరిహరన్ న్యాయవాది. ఇతను పదేళ్లకు పైగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద తిరువళ్లూరు, మనవాళనగర్ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు చిట్టీలు కట్టారు. ఇలా కట్టినవారికి 2022 నుంచి సరిగా డబ్బులు ఇవ్వలేదు. ఇందుకు సంబంధించి బాధితులు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. ఇందుకు నిరసనగా, న్యాయవాదిని అరెస్టు చేయాలని కోరుతూ బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు.

సబ్‌వే పనులు త్వరగా పూర్తిచేయాలని గ్రామస్థులు...

అరక్కోణం: రాణిపేట జిల్లా అరక్కోణం సమీప కావనూరు వద్ద రైల్వే సబ్‌వే నిర్మాణ పనులు రెండేళ్లుగా జరుగుతున్నాయి. దీంతో పట్టాల నుంచి రాకపోకలు సాగించే పంచాయతీకి చెందిన ఏడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు త్వరగా పనులు పూర్తి చేసి మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండు చేస్తూ శుక్రవారం అక్కడకు వచ్చిన రీజినల్ మేనేజరు ఆర్ముగాన్ని ముట్టడించారు. పంచాయతీ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, వార్డు కౌన్సిలర్లు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

◆ బైక్ ఢీకొని మహిళ మృతి

రూ.16.26 లక్షలు పరిహారం అందించాలని కోర్టు ఆదేశం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరుత్తణి గాంధీ రోడ్డుకు చెందిన గోవిందరాజన్ భార్య రాజలక్ష్మి (49) టైలర్. ఈమె 2020 జులై ఒకటిన స్థానిక మహిషాసురమర్ధిని ఆలయం వద్ద నిలబడి ఉండగా ఓ ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. పరిహారంగా వాహన చోదకుడు రూ.25 లక్షలు అందజేయాలని గోవిందరాజన్ చెన్నై మోటార్ వాహన విపత్తు పరిహారం ఫోరంలో కేసు దాఖలు చేశాడు. న్యాయమూర్తి లింగేశ్వరన్ కేసు విచారించారు. చోదకుడికి డ్రైవింగ్ లైసెన్సు లేదని, బీమా ఉందని విచారణలో తేలింది. అతివేగంతో వాహనం నడపడంతోనే ప్రమాదం సంభవించిందని, కావున చోదకుడు, బీమా సంస్థ కలిసి మృతురాలి కుటుంబానికి పరిహారంగా రూ.16.26 లక్షలు అందజేయాలని న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.

'డీఎంకేలో సీనియర్ నేతల తిరుగుబాటు ఖాయం'



మాట్లాడుతున్న విజయకుమార్

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పదవిని ఉదయనిధికి అప్పగించడం సీనియర్ నేతలకు నచ్చక పార్టీ అధిష్ఠానంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసేందుకు సిద్ధమైనట్లు అన్నాడీఎంకే మాజీ ఎంపీ, విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ ఆరోపించారు. ఊత్తుకోట పట్టణం, పూండి పడమర యూనియన్ కార్యకర్తల సమావేశం పోందవాక్కంలో గురువారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షత వహించి విజయకుమార్ మాట్లాడుతూ... బ్యాంకుల్లో విద్యార్థులు పొందిన రుణాలను మాఫీ చేస్తామని, నీట్ రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, మూడున్నరేళ్లలో ఒక్క విద్యార్థి రుణం కూడా మాఫీ చేయలేదని, ఇదేనా ద్రావిడ మోడల్ పాలన అని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి బలరామన్, కోశాధికారి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే కేఎస్ విజయకుమార్, యూనియన్ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

పలు రైళ్ల సేవల్లో మార్పులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై బీచ్ యార్డులో జరుగుతున్న ఇంజినీరింగు పనుల కారణంగా పలు రైళ్ల సేవల్లో మార్పులు జరిగాయని దక్షిణ రైల్వే శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

◆ **08558** చెన్నై ఎగ్మూరు - విశాఖపట్నం ప్రత్యేక రైలు 27న 10.30కు బయలుదేరాల్సిన రైలు 10.45కు చెన్నై సెంట్రల్ నుంచి నడుస్తుంది. ◆ **08557** విశాఖపట్నం - ఎగ్మూరు 26న 19.00కు బయలుదేరే రైలు చెన్నై సెంట్రల్‌కు వస్తుంది. ◆ **17644** కాకినాడ పోర్టు - చెంగల్పట్టు సర్కార్ ఎక్స్‌ప్రెస్ 26న 14.30కు బయలుదేరే రైలు కొరుక్కుపేట, అరక్కోణం, మేల్‌పాక్కం, చెంగల్పట్టు మార్గంగా వెళ్తుంది. ◆ **17651** చెంగల్పట్టు - కాచిగూడ 27న 15.35కు బయల్దేరాల్సిన రైలు 16.35 గంటలకు ఆలస్యంగా నడుస్తుంది. ◆ **17643** చెంగల్పట్టు - కాకినాడ పోర్టు 27న 16.00కు నడవాల్సిన రైలు 17.00 గంటలకు బయలుదేరుతుంది.

◆ **దారి మళ్లింపు...** రంగియా డివిజన్‌లోని నల్‌బరి, బైహటా డివిజన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా **15930** న్యూ టిన్‌సుకియా - తాంబరం వీక్లీ 28న 06.30కు బయలుదేరే రైలు ఫర్‌కేటింగ్, లుండింగ్, గువాహటి, గోల్పారా స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలి

సైదాపేట: తమిళనాడులో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాజ్యాంగం ప్రకారం మత్తు కలిగించే మద్యాన్ని ఉత్పత్తి చేయడం, విక్రయించడం తదితర అన్నీ అధికారాలూ రాష్ట్ర ప్రభుత్వాలకే ఉన్నాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం కుదరదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని కారణంగా చూపుతూ మద్య నిషేధానికి నిరాకరిస్తున్న డీఎంకే ప్రభుత్వానికి ఈ తీర్పు గొడ్డలిపెట్టన్నారు. కావున ఆలస్యం చేయకుండా రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిరుత సంచారం



విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల అభయారణ్యం పరిధిలోని ప్రసిద్ధ బన్నారియమ్మన్ ఆలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ సమీపంలోని దట్టమైన అడవి నుంచి బయటికి వచ్చిన ఓ చిరుత ఆ ప్రాంతంలో సంచరించింది. గుర్తించిన ప్రజలు, వాహన చోదకులు భయాందోళన చెందారు. కొందరు సెల్‌ఫోన్లలో వీడియోలు తీశారు. అవి ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో వైరలయ్యాయి.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పూండి సమీప పోందవాక్కంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్‌వన్ చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు అశోకన్ అధ్యక్షత వహించారు. పూండి తూర్పు యూనియన్ డీఎంకే కార్యదర్శి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై 155 మందికి సైకిళ్లు అందజేశారు. పంచాయతీ అధ్యక్షురాలు చిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం పశ్చిమ యూనియన్ చెంబేడు పంచాయతీ రాజీవ్‌గాంధీనగర్ వద్ద రూ.ఐదు లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ జరిగింది. అరక్కోణం ఎమ్మెల్యే ఎస్.రవి ముఖ్యఅతిథిగా పాల్గొని పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య



రియాజ్ (పాతచిత్రం)

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఆవడి సమీప తిరునిండ్రవూరు గంగమ్మ ఆలయ వీధికి చెందిన రియాజ్ (22) పూందమల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతను గురువారం రాత్రి కత్తి గాయాలతో ఇంటి వెనుక విగతజీవిగా పడి ఉండడాన్ని ఆ ప్రాంతవాసులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. నడుకుత్తగైకి చెందిన జగన్నాథన్ అనే వ్యక్తి భార్య శ్యామల కుటుంబ కలహాలతో భర్తను వీడి నివసిస్తోంది. ఆమెతో రియాజ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసిన జగన్నాథన్ తన స్నేహితుడు జేమ్స్‌తో కలిసి ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో రియాజ్ మృతి చెందినట్లు తేలింది. పోలీసులు నిందితులిద్దరిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

అత్తను చంపిన కోడలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి జిల్లా అరియమంగళానికి చెందిన అక్బర్ అలీ భార్య షంషద్ బేగం (55). ఈమె భర్త చనిపోవడంతో కుమారుడు సిరాజ్, కుమార్తె నిషాతో కలిసి జీవిస్తోంది. ఇదిలా ఉండగా సిరాజ్‌కు ఆయుషా బేగం (22) అనే యువతితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి తొమ్మిది నెలల ఆడ శిశువు ఉంది. ఈ క్రమంలో ఆయుషాబేగం మానసిక ఆందోళనకు గురై మానసిక వైద్యుడి వద్ద చికిత్స పొందుతోంది. కొన్ని సందర్భాల్లో ఈమె పిచ్చిగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. అత్త ముఖంపై దుండుతో అదిమి, గొంతు నులిమి చంపడానికి పలుమార్లు యత్నించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం వంట చేస్తున్న షంషద్ బేగంపై కోడలు కత్తితో దాడి చేసి హతమార్చింది. పెనుగులాటలో ఆయుషా బేగం, ఆమె బిడ్డకు కూడా గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో బాలిక మృతదేహం లభ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: శివగంగైకి చెందిన బాలుసామికి కాట్టాణికుళం గ్రామంలో చెరకు తోట ఉంది. గురువారం అతను తోటకు వెళ్లాడు. అక్కడున్న బావిలోంచి దుర్వాసన రావడంతో తొంగి చూశాడు. 13-18 ఏళ్ల వయసున్న బాలిక మృతదేహం కుళ్లినస్థితిలో కనిపించింది. ఆమె చేతులు, కాళ్లు కట్టేసి ఉన్నాయి. సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. బాలిక కుడిచేయి విరగొట్టి ఉంది. తలపై రాయితో దాడిచేసిన గాయాలు ఉన్నాయి. అనంతరం పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

కళాశాల విద్యార్థి బలవన్మరణం



రిషిప్రియన్ (పాతచిత్రం)

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: సేలం జిల్లా ఎడప్పాడికి చెందిన మారియప్పన్ హెడ్‌కానిస్టేబుల్. ఇతని కుమారుడు రిషిప్రియన్ (17) కోవై పీళమేడులోని బీఎస్‌జీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆటో మొబైల్ అప్లికేషన్ తొలి ఏడాది చదువుతున్నాడు. ఇతను గురువారం రాత్రి హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీళమేడు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుని ఢీకొన్న బస్సు.. 30మందికి గాయాలు

క్రైం కార్నర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా నత్తం సమీప కొట్టపట్టి నుంచి 40 మందికి పైగా ప్రయాణికులతో నత్తంకు శుక్రవారం ఉదయం ఓ ప్రభుత్వ బస్సు బయలుదేరింది. సెంగుళం వద్ద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి డ్రైవరు బస్సును పక్కకు మళ్లించడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చింతచెట్టుని ఢీకొంది. ప్రమాదంలో బస్సులో ఉన్న 30మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. వారిని స్థానికులు నత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందులో తీవ్రంగా గాయపడిన ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం దిండుక్కల్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

దోపిడీ కేసులో నలుగురి అరెస్టు

పొన్నేరి, న్యూస్‌టుడే: మీంజూరు సమీప అత్తిపట్టు పుదునగర్‌కు చెందిన బిలాల్, ఆశిష్ కారు డ్రైవర్లు. వీరు గురువారం సాయంత్రం అత్తిపట్టులో కార్లతో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు అక్కడకు చేరుకుని ఇనుపరాడ్డుతో దాడి చేసి రూ.4 వేల నగదు దోచుకుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు మీంజూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి అత్తిపట్టుకు చెందిన అరుణ్, దర్వేష్, రాహుల్, కార్తిక్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు.

యువకుడి ఇంట్లో బంగారు నాణేలు చోరీ

డేటింగ్ యాప్‌లో పరిచయమైన యువతి చేతివాటం

ప్యారిస్, న్యూస్‌టుడే: డేటింగ్ యాప్‌లో ఓ యువకుడికి పరిచయమైన యువతి అతని వద్ద బంగారు నాణేలు కాజేసింది. పోలీసుల వివరాల మేరకు... చెన్నై వెస్ట్ మాంబలానికి చెందిన ఓ ఇంజినీర్ (30) అవివాహితుడు. అతనికి డేటింగ్ యాప్‌లో ఓ యువతి పరిచయమైంది. అనంతరం ఈ నెల 22న అతని ఇంట్లో ఇద్దరూ కలిశారు. ఆమెకు తన ఇల్లంతా చూపించాడు. ఇంటి నుంచి వెళ్లిన తర్వాత తెరచి ఉన్న బీరువాను గుర్తించారు. అందులో ఉన్న రూ.2.50 లక్షల విలువైన 5 సవర్ల బంగారు నాణేలు యువతి కాజేసినట్లు నిర్ధారించుకుని అశోక్‌నగర్ పోలీసులకి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థత

వేళచ్చేరి, న్యూస్‌టుడే: అరియలూర్ జిల్లా సెందురై సమీప పొన్‌పరప్పి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెనుకబడిన తరగతులశాఖకు చెందిన బాలికల వసతిగృహం ఉంది. ఇందులో 11వ తరగతి విద్యార్థినులు ముగ్గురు, ప్లస్‌టూ విద్యార్థినులు ముగ్గురు బస చేశారు. శుక్రవారం ఉదయం అల్పాహారంగా వీరికి పొంగలి పెట్టారు. అది తిన్న ఐదుగురు పాఠశాలకు వెళ్లారు. కొద్ది సేపటికే వాంతులై అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు వారిని పొన్‌పరప్పి ఆసుపత్రికి తరలించారు.



ఘటనాస్థలి

బస్సును ఢీకొన్న లారీ.. ఇద్దరి మృతి

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ బస్సును మినీ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కోవిల్ నుంచి తిరునెల్వేలి వైపు ఓ ప్రభుత్వ బస్సు తిరునెల్వేలి-కన్నియాకుమరి జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం వెళ్తోంది. ఆ సమయంలో కాంచీపురం నుంచి కావల్‌కిణరు వైపు వెళ్తున్న మినీ లారీ బస్సును ఢీకొంది. ప్రమాదంలో లారీ డ్రైవర్ సహా ఇద్దరు ఘటనాస్థలంలో మృతి చెందారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడి దాడిలో కండక్టర్...

ప్యారిస్: చెన్నైలో 46జీ ప్రభుత్వ బస్సు గురువారం రాత్రి మహాకవి భారతియార్ నగర్ బస్టాండు నుంచి కోయంబేడు బస్టాండు వైపు బయల్దేరింది. ఇందులో సైదాపేటకి చెందిన జగన్ కండక్టర్. బస్సు అమింజకరై అన్నా ఆర్చ్ వద్ద వెళ్తుండగా అందులో ఉన్న ఓ ప్రయాణికుడు గోవిందన్, కండక్టర్‌కి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో ప్రయాణికుడు దాడిచేయడంతో కిందపడిన జగన్ ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి గోవిందన్‌ని అరెస్టు చేశారు.

మేడ పైనుంచి పడి పెయింటర్...

ఆర్కేనగర్: తిరువారూర్ జిల్లా కుడవాసల్ విక్కిరపాండికి చెందిన బెత్తపెరుమాళ్ (41) పెయింటర్. ఇతను తొట్టియంలోని శ్రీ మదురై కాళియమ్మన్ ఆలయంలో కొన్నిరోజులుగా పని చేస్తున్నాడు. అక్కడే ఉన్న కమ్యూనిటీ హాల్‌లో బస చేస్తున్నాడు. ఇదిలా ఉండగా గురువారం హాల్ మేడపైకి ఎక్కుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

రూ.10 లక్షల దారి దోపిడీ



గాయపడిన యువరాజ్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మొరపాక్కం ప్రాంతానికి చెందిన యువరాజ్ (41) చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉద్యోగులకు దీపావళికి బాణసంచా గిఫ్టు బాక్సులు ఇవ్వడానికి కంపెనీ యాజమాన్యం నిర్ణయించింది. ఆ మేరకు బాణసంచా కొనుగోలు చేయడానికి యువరాజ్ వ్యానులో శివకాశి బయలుదేరి వెళ్లాడు. వ్యాను అతనే నడిపాడు. చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిపై పెరంబలూర్ జిల్లా తన్నీర్‌పందల్ ప్రాంతంలో గురువారం రాత్రి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వెంబడించిన కొందరు దుండగులు వ్యానును అడ్డగించి మారణాయుధాలతో యువరాజ్‌పై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.10 లక్షలు దోచుకుని పారిపోయారు. తీవ్రంగా గాయపడిన యువరాజ్ తరువాత ఆ ప్రాంతంలో ఉన్న పెట్రోలు బంకు వద్దకు వెళ్లి సిబ్బందికి జరిగిన విషయం చెప్పాడు. సమాచారం మేరకు పెరంబలూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి యువరాజ్‌ను ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.



కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టరు చంద్రకళ

ఘన వ్యర్థాల నిర్వహణ ఎలా సాగుతోంది?

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం సమీప తక్కోళం వద్ద ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని జిల్లా కలెక్టరు చంద్రకళ శుక్రవారం సందర్శించారు. వెంట అరక్కోణం ఆర్డీవో ఫాతిమా, పట్టణ పంచాయతీ అధ్యక్షుడు నాగరాజన్, పంచాయతీ కార్యనిర్వాహక అధికారి మాదేశ్వర ఉన్నారు.

నవంబరు 5, 6 తేదీల్లో కోవైలో క్షేత్రపరిశీలన

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వం ప్రకటించిన పథకాల అమలును నవంబరు 5, 6 తేదీల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ కోయంబత్తూర్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కార్యకర్తలకు రాసిన బహిరంగ లేఖలో ఈ విషయాన్ని వెల్లడించారు. మిగతా జిల్లాల్లోనూ పరిశీలనలు ఉంటాయని, ద్రావిడ మోడల్ ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని తెలిపారు.